AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in





4-10-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## డైవర్షన్ వంతెన పనులు పూర్తిచేయాలి



**అక్షరటుడే,లింగంపేట:** కేకేవై రహదారిపై లింగంపల్లి కుర్దు పాముల వాగు వంతెన వద్ద నూతనంగా నిర్మిస్తున్న డైవర్షన్ వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం డైవర్షన్ వంతెన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డైవర్షన్ వంతెన నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు చేయించానన్నారు.

**అధికారుల తీరుపై అసహనం..**

వంతెన పనులు నెమ్మదిగా సాగడంతో అధికారులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వంతెన పనులు జరుగుతుండడంతో నెలన్నర రోజులుగా బస్సులు నడవలేని పరిస్థితి ఎదురైందని అన్నారు. ప్రధానంగా కామారెడ్డికి, ఎల్లారెడ్డికి బస్సు సర్వీసులు నిలిచిపోయాయన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఆర్అండ్‌బీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## జిల్లా పరిషత్‌పై కాషాయ జెండా ఎగరేస్తాం



**అక్షరటుడే, ఇందూరు :** జిల్లా పరిషత్‌పై కాషాయ జెండా ఎగురవేయబోతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రూరల్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లకు ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. కేవలం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ వైఖరి పట్ల ప్రజలు నిరాశతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రధాని మోదీకి ప్రజలంతా మద్దతుగా ఉన్నారని, కావున బీజేపీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పద్మారెడ్డి, జగన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవి, గోపి, బిలోజి నాయక్, ఆనంద్, సందీప్ పాల్గొన్నారు.

## రేపు మాజీ మంత్రి హరీష్ రావు రాక

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రానికి మాజీ జెడ్పీటీసీ హరాలే తానాజీ రావు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఆదివారం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. గాంధారిలోని హరాలే గార్డెన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా, సభకు మాజీ మంత్రి హరీష్‌రావు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన సూచించారు.



# రాయితీ యంత్రాలు అందేనా?

రైతులు వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలను అందజేస్తోంది. అయితే అవగాహన లేకపోవడంతో చాలా మంది రైతులు దీనికి దరఖాస్తు చేసుకోవడం లేదు. నిజామాబాద్ జిల్లాకు 6,742 యూనిట్లు మంజూరైతే 476 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు దరఖాస్తు చేసుకున్న వారికి నెలలు గడుస్తున్నా రాయితీ పరికరాలు అందడం లేదు.

**- అక్షరటుడే, భీమ్‌గల్**

- జిల్లాకు 6,742 యూనిట్లు మంజూరు
- 476 మంది రైతుల దరఖాస్తు
- యాంత్రీకరణ పథకంపై ఆసక్తి చూపని అన్నదాతలు
- అవగాహన కల్పించని అధికారులు
- ముందుకు సాగని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, మిగతా రైతులకు 40 శాతం సబ్సిడీపై యంత్రాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు 6,742 యూనిట్లు మంజూరు కాగా మొత్తం పదకొండు రకాల పరికరాలకు ఈ పథకం వర్తించనుంది. ఇందుకుగాను జిల్లాకు రూ.5.20 కోట్లు కేటాయించగా మొదటి విడతగా రూ.1.67 కోట్లు జిల్లాకు వచ్చాయి. అయితే ట్రాక్టర్లు, డ్రోన్లకు ఇందులో అవకాశం కల్పించకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పురోగతి శూన్యం**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కోసం అర్హులైన రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇది వరకే ఈ ప్రక్రియ పూర్తయింది. వందల సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయి. అర్హుల జాబితా తర్వాత లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకోవాల్సి ఉంది. వ్యవసాయ అధికారులు గుర్తించిన రైతులు 50శాతం సబ్సిడీతో యంత్రాలు, పనిముట్లు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. కానీ లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

**కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ**

వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రైతుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేదు. దీంతో అధికారులు ఇప్పటికీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 15 నాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఆగస్టు 27 వరకు డీడీలను సేకరించాలి. సెప్టెంబర్ 17 నుంచి యంత్ర సామగ్రి అందజేయాలి. కానీ అధికారులు ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆఫ్‌లైన్లో దీనికోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే రైతులకు అవగాహన లేకపోవడంతో చాలా మంది దరఖాస్తులు చేయడం లేదు. మరోవైపు రైతుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలి. కానీ ఆ పోర్టల్ ఇంత వరకు ఓపెన్ చేయలేదు. దీంతో దరఖాస్తులు వ్యవసాయ అధికారుల వద్దే ఉన్నాయి. దీంతో దరఖాస్తు చేసుకున్న రైతులు సబ్సిడీ పరికరాలు అందుతాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు.

**లబ్ధిదారుల ఎంపిక ఇలా..**

వ్యవసాయ పరికరాల కోసం వచ్చిన దరఖాస్తుల్లో నుంచి లబ్ధిదారులను అధికారులతో కూడిన కమిటీలు ఫైనల్ చేయనున్నాయి. రూ.లక్ష లోపు పరికరాలకు మండల స్థాయి కమిటీ ఎంపిక చేస్తుంది. ఇందులో మండల వ్యవసాయాధికారి, తహశీల్దార్, ఎంపీడీవో ఉంటారు. అలాగే రూ.లక్షకు పైబడిన యంత్రాలుంటే జిల్లా స్థాయి కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయాధికారి, ఆగ్రోస్ ఆర్ఎం, వ్యవసాయ శాస్త్రవేత్త, ఎల్డీఎం సభ్యులుగా ఉంటారు.

**జిల్లాకు మంజూరైన యూనిట్లు, నిధులు**

| డివిజన్ | యూనిట్లు | నిధులు(రూ.లక్షల్లో) |
|---|---|---|
| నిజామాబాద్ రూరల్ | 1,461 | 103.28 |
| బోధన్ | 1,149 | 91.25 |
| బాన్సువాడ | 1,242 | 89.60 |
| నిజామాబాద్ అర్బన్ | 98 | 14.50 |
| ఆర్మూర్ | 1,077 | 92.05 |
| భీమ్‌గల్ | 1,684 | 122.35 |

**పథకంలోని పరికరాలు**

| పరికరాలు | యూనిట్లు |
|---|---|
| పిచికారీ యంత్రాలు | 5,098 |
| పవర్ స్ప్రేయర్లు | 715 |
| రోటవేటర్లు | 274 |
| బ్రష్ కట్టర్స్ | 58 |
| పవర్ టిల్లర్స్ | 41 |
| స్ట్రా బేలర్స్ | 77 |
| మెజ్ షెల్లర్స్ | 20 |
| డిస్కో రోటవేటర్స్ | 347 |
| బండ్ ఫార్మర్ | 15 |
| పవర్ వీడర్స్ | 33 |
| సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్లర్స్ | 64 |

## గోదావరి పుష్కరాలకు నిధులివ్వండి: ఎంపీ



**అక్షరటుడే, ఆర్మూర్:** గోదావరి పుష్కరాలు సమీపిస్తున్నందున నిధులు ఇవ్వాలని ఎంపీ సురేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నిధుల కేటాయింపు కోసం కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. ప్రసాద్ (తీర్థయాత్ర పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్) పథకం కింద నిధుల కేటాయింపు కోసం విన్నవించారు. పన్నెండు ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కరాలు కావడంతో, లక్షలాది మంది యాత్రికులు, భక్తులు శ్రీరాంసాగర్‌కు విచ్చేస్తారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని శ్రీ రామ్‌సాగర్ ప్రాజెక్ట్ (పోచంపాడ్) వద్ద మౌలిక సదుపాయాలతో పాటు రాముడు, శివాలయాల అభివృద్ధికి సహకరించాలని లేఖలో కోరారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందునా ప్రసాద్ పథకం కింద నిధులు సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు.

## రేపు ఎస్సారెస్పీ ముంపు బాధితుల సమావేశం..

**అక్షరటుడే, ఇందూరు:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ముంపు, వరద బాధితులను ఒకేతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ముంపు, వరద కారణాలపై చర్చించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకునేందుకు బాధితులు స్వచ్ఛందంగా కదిలి రావాలని న్యాయవాది బీ మనోహర్ (మాజీ డీఎస్పీ) పిలుపునిచ్చారు. నవీపేటలోని రఘుపతి రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం (ఈ నెల 5న) మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి బోధన్, ముథోల్, ఆర్మూర్, నిర్మల్, బాన్సువాడ నియోజకవర్గంలోని వరద ముంపు గ్రామాల ప్రజలు, రైతులు రావాలని కోరారు.

## స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా రద్దు చేయబడిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

**అక్షరటుడే, మెండోరా:** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టింది. మొన్నటివరకు ప్రాజెక్టులోకి 4 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. దీంతో 9 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1090.40 అడుగుల (78.57 టీఎంసీలు)కు చేరింది.

**నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద**

**ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం 1,02,369 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు గేట్లు ఎత్తి దిగువకు 60 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా. ప్రస్తుతం 17.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.





ఎడపల్లి మండలంలో బతుకమ్మ సంబురాలను శనివారం నిర్వహించారు. మండలంలోని దేశ్‌ముఖ్‌ల ఆధ్వర్యంలో బతుకమ్మను తీరొక్క పూలతో అందంగా పేర్చారు. అనంతరం వాటిని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఎడపల్లి సంస్థానం దేశ్‌ముఖ్‌ల పాలనలో ఉన్నప్పటి నుంచి దసరా తర్వాతే బతుకమ్మ సంబురాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. **–అక్షరటుడే, బోధన్**

## పాత కక్షలే దాడులకు కారణం



**అక్షరటుడే, కామారెడ్డి:** విజయదశమి రోజు అర్ధరాత్రి కలకలం రేపిన దాడుల ఘటనపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఘటనకు కారకులైన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. విజయదశమి రోజు అర్ధరాత్రి తమకు '100'కు కాల్ వచ్చిందని, వెంటనే తమ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లగా.. అక్కడ రెండు గ్రూప్‌లు కొట్టుకుంటున్నాయని తెలిపారు. ఈ ఘటనలో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించగా గాజుముక్కతో దాడి జరిగినట్లు తేలిందన్నారు. అలాగే కేతన్, ప్రఫుల్ అనే ఇద్దరు యువకులపై సిద్దార్థ్ అనే వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో గాజు ముక్కతో దాడి చేశాడన్నారు. ఈ దాడిలో నలుగురికి గాయాలయ్యాయని, సిద్దార్థ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా వదిలిపెట్టేది లేదని ఏఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో పట్టణ సీఐ నరహరి పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి

**అక్షరటుడే, ఇందూరు :** ఎన్నికల విధులు, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా ఎన్నికలు జరిగేలా పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టరేట్‌లో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాంటి వివాదాలకు, తప్పిదాలకు తావు లేకుండా నిబంధనలు పాటిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఆర్వోలు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్వోలు నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఆరోజు నుంచి ప్రాదేశిక నియోజకవర్గం నామినేషన్లు స్వీకరించాలని చెప్పారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలన్నారు. అభ్యర్థి సహా ముగ్గురిని మాత్రమే లోనికి అనుమతించాలని చెప్పారు.

**బ్యాలెట్ పేపర్‌లో తెలుగు అక్షర క్రమంలో..**

బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే



అన్ని దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి.. ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి.. అందుకు గల కారణాలు తదితర అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు సహకారం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఆర్వో, ఏఆర్వోల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు జెడ్పీ సీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్‌డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయాలని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈవో సాయా గౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్న, డీఈవో అశోక్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విఠలేశ్వర ఆలయంలో మహా అన్నదానం



**అక్షరటుడే, బీర్కూర్:** బీర్కూర్ మండలంలోని బైరాపూర్ గ్రామంలో తెలంగాణ పండరీపూర్‌గా ప్రసిద్ధి పొందిన శ్రీ విఠలేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ, ఆలయ కమిటీ ఛైర్మన్ ద్రోణవల్లి సతీష్, లక్ష్మి దంపతులు ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. రోజురోజుకీ భక్తుల సంఖ్య పెరుగుతుండటం సంతోషకరమని అన్నారు. వ్రతం అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు




**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బాబానగర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో ఇతర పార్టీల కార్యకర్తలు చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ధర్పల్లి రమేష్, బీమ అనిల్, నితీష్, పెద్ద బక్కన్న, ముచ్కూర్ రాజన్న, దినకర్, ధర్పల్లి రాజన్న, యాదగిరి, రాజేశ్వర్, పెద్దన్న, బావన్న, ఎర్రన్న, మల్కన్న తదితరులు ఉన్నారు. మరో 25 మంది సైతం పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోదిరె స్వామి, కన్నె సురేందర్, లింబాద్రి, గ్రామ కాంగ్రెస్ నాయకులు రాజేందర్, అరవింద్, మంద రాజేష్, పురుషోత్తం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన నేతలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మీ నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు శనివారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు నగరంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయన తల్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం భూపతిరెడ్డితో మాట్లాడి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. లక్ష్మీనర్సమ్మ మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. వారి వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బంజారా నాయకుడికి సన్మానం




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆల్ ఇండియా బంజారా సేవా సంఘట్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడిగా కున్సోత్ కిషన్ నాయక్ ఇటీవల ఎన్నికయ్యారు. దీంతో ఆలూర్ మండలం కల్లెడ గ్రామ కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కిషన్ నాయక్ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నీలగిరి శ్రీనివాస్, యూత్ ప్రెసిడెంట్ సిరికొండ మహేష్, యువజన జనరల్ సెక్రెటరీ శివకృష్ణ, రాజు, గంగాధర్, సురేష్ గౌడ్, టీంకు, అర్జిత్, కిట్టి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని దేవునిపల్లిలో..



గాంధారిలో..

# గంగమ్మ ఒడికి దుర్గమ్మ..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు భక్తులతో పూజలందుకున్న దుర్గమ్మ నిమజ్జనానికి తరలివెళ్లింది.ఉమ్మడి జిల్లాలో శనివారం సాయంత్రం అమవార్ల ప్రతిమలను ఊరేగించారు. ఈ సందర్భంగా భారీ సెట్టింగులతో రథాలను తయారు చేసి భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి ముందు భవానీ భక్తులు నృత్యాలు చేశారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



నిజామాబాద్ నగరంలో..



నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్‌లో..



కామారెడ్డిలోని దేవునిపల్లిలో భక్తుల కోలాటం



గాంధారిలో భజన చేస్తున్న భక్తులు

## 'ప్రభుత్వాలకు ఉద్యమకారుల గోస పట్టదా..'

**అక్షరటుడే, బాన్సువాడ:** స్వరాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులను ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోవట్లేదని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్, బాన్సువాడ మండల అధ్యక్షుడు గంజివార్ చందు ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల పాలనలో ఉద్యమకారుల ఆశయాల పక్కన పడేశారన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇస్తానని చెప్పినా రెండేళ్లు గడిచినా పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్నా, ఉద్యమకారుల మనోభావాల పై ఒక్కరికి పట్టినట్లు లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉద్యమకారుల ఆశయాలను గ్రహించి న్యాయం చేయాలని కోరారు.

## మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు పరామర్శ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెం నర్సయ్య అనారోగ్యానికి గురై కొన్నాళ్లుగా చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి శనివారం కమ్మర్‌పల్లికి వెళ్లారు. చికిత్స చేయించుకుని కోలుకుంటున్న పాలెపు నర్సయ్యను పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి పిలుపునిచ్చారు. శనివారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఒక్కో స్థానం నుంచి ముగ్గురి పేర్లను అధిష్టానానికి పంపుతున్నామన్నారు. అందులో నుంచి ఎవరికి టికెట్ వచ్చినా.. ఇతరులు నిరుత్సాహపడవద్దని అన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, ఏలేటి గంగాధర్, పడగల ప్రవీణ్, నూకల బుచ్చిమల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, సుంకెట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆలయంలో షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని కోటగల్లిలోని కోట దుర్గాదేవి ఆలయంలో షెడ్డు నిర్మాణానికి కురిపాటి మమత, యోగేశ్వర్ రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళాన్ని అందజేశారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు చెక్కు అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ఇందిరమ్మ ఇంటికి కాంగ్రెస్ నాయకులు చెక్కు అందజేశారు. కాలనీలోని లబ్ధిదారులు అనసూయకు రూ. లక్ష చెక్కును శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, 15వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి జిమ్మీ రవి, అజ్జు, రవికాంత్ రెడ్డి, చంద్రన్న, వార్డు ఆఫీసర్ అవినాష్ పాల్గొన్నారు.

## చిల్డ్రన్ హోంకు నిత్యావసరాల అందజేత




**అక్షరటుడే, ఇందూరు:** హెల్ప్ టు అదర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందజేశారు. అమెరికాకు చెందిన శ్రీలత స్థాపించిన ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని మామిడిపల్లిలో తపస్వి చిల్డ్రన్ హోమ్‌లో విద్యార్థులకు శనివారం సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లావణ్య మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్వి సంరక్షకులు శ్రీనివాస్, కవిత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విజయానంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పులాంగ్ చౌరస్తాలో గుంతలమయంగా ఉన్న రోడ్డు



నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్ సమీపంలో..



# రోడ్లపై గుంతలు.. తప్పని అవస్థలు

నగరంలో రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. గల్లీల్లో రోడ్ల దుస్థితి అటు ఉంచితే ప్రధాన రోడ్లపై గుంతల కారణంగా నగరవాసులు అవస్థలు పడుతున్నారు. పులాంగ్ చౌరస్తా వద్ద, నిఖిల్‌సాయి హోటల్ చౌరస్తాలో, పాత కలెక్టరేట్ చౌరస్తా, ఎన్టీఆర్ విగ్రహం వద్ద, గాయత్రినగర్ దగ్గర్లోని శ్మశానవాటిక వద్ద నడిరోడ్డుపై గుంతలు వాహనదారులను భయపెడుతున్నాయి. వాహనాలు పాడవడంతో పాటు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని నగరవాసులు వాపోతున్నారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పాత కలెక్టరేట్ చౌరస్తా వద్ద..



నిఖిల్ సాయి హోటల్ సమీపంలో..

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని వన్నెల్ (బి) శివారులో వరద కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 30-40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు ఫుల్ షర్ట్ ధరించినట్లు పేర్కొన్నారు. కుడి చేతికి నలుపు రంగు దారం ఉందని, మృతదేహాన్ని ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని లేదా 8712659859, 8712659860 నంబర్లకు సమాచారమివ్వాలన్నారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలం పోచారం ప్రాజెక్ట్ వద్ద చోటు చేసుకుంది. రాజంపేట మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన పచ్చుంటి శేఖర్ (32) దసరా రోజు సరదాగా చేపల వేటకు వెళ్లాడు. పోచారం ప్రాజెక్ట్ దిగువన తన కుమారుడితో కలిసి చేపలు పడుతుండగా.. గాలం నీటిలో ఇరుక్కుంది. దీంతో దానిని తీసేందుకు నీటిలోకి దిగిన శేఖర్ ఎంతకు బయటకు రాలేదు. దీంతో ఆయన కుమారుడు పక్కన ఉన్న వారికి చెప్పాడు. వారు అక్కడ గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో నీటిలో వెతకగా.. శనివారం ఉదయం మృతదేహం లభించింది. శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో చోరీ

**అక్షరటుడే, గాంధారి:** మండలకేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దసరా సెలవుల అనంతరం శనివారం సిబ్బంది పాఠశాల తలుపులు తెరిచి చూడగా, బియ్యం చోరీకి గురైనట్లు ఎంఈవో శ్రీహరి తెలిపారు. అలాగే కంప్యూటర్‌ను సైతం ఎత్తుకెళ్లేందుకు యత్నించగా వీలు కాకపోవడంతో అక్కడే వదిలేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.